అవిశ్వాస తీర్మానానికి అడుగులు!

- శంషాబాద్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ కన్ను
- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు కౌన్సిలర్లు
- మరికొందరిని కూడగట్టే ప్రయత్నం



శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకోవాలని ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో ఇద్దరే ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం దీంతో ఎనిమిదికి చేరింది. మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలో మరో ఐదురుగు కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపితే మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకోవచ్చనే ఆశాభావంతో ఉన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కీలక నేతలు కూడా పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లకు వెన్నుదన్నుగా నిలిస్తూ పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జోరుగా చర్చలు..

మిగతా కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు గత వారం రోజులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి చర్చలు ఊపందుకున్నప్పటికి ఇంకా ఓ కొలిక్కిరాలేదు. కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తిగా ఉన్నప్పటికి భవిష్యత్తు రాజకీయాలపై అంతర్గతంగా తర్జనభర్జనలు పడుతున్నారు. మరో ఆరునెలల్లో మున్సిపాలిటీల గడువు ముగిసిన తర్వాత మున్సిపాలిటీ కొనసాగుతుందా..? లేదా గ్రేటర్‌లో విలీనమవుతుందా...? అంశాలు కూడా నిర్ణయంలో కీలకంగా మారుతోంది. ఒక వేళ గ్రేటర్‌లో విలీనం ఖాయమైతే కాంగ్రెస్ పెట్టే అవిశ్వాసానికి మద్దతు ఇచ్చినా పెద్దగా నష్టమేమి ఉండదనే ఆలోచన కూడా కొందరు ప్రజాప్రతినిధుల్లో ఉంది. అవిశ్వాసానికి పదిహేను సంఖ్య సరిపిపోయినప్పటికి నోటీసు ఇచ్చే సమయానికి కనీసంగా పదిహేడు మంది సంఖ్య ఉండాలనే నిబంధన కూడా కాంగ్రెస్ పార్టీకి కొంత సంక్లిష్టంగా మారుతుందనే చర్చలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే ఓ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను చేజిక్కించుకున్న కాంగ్రెస్ శంషాబాద్‌ను కూడా తమ ఖాతాలో వేసుకునేందుకు పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇందులో చర్చలు సఫలమైతే అనుకున్నది సాధ్యమవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా చిన్ననాటి నుంచే పిల్లలకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అంతేకాకుండా మంచి, చెడులతో కూడిన కథలను కూడా వారికి సూచించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ఎంతో మెరుగైందని, నాణ్యమైందని అన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, భూపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, రాజిరెడ్డి, టింకురెడ్డి, సంగారెడ్డి, ఖాజాపాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవాల వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలోనే వేయాలి


ప్లాస్టిక్ కవర్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

బండ్లగూడ: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అదే విధంగా జీవాల వ్యర్థాలను కవర్లలోనే వేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని మసీదుల వద్ద ముస్లిం సోదరులకు వేస్టేజ్ కవర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్‌ను పురస్కరించుకొని వచ్చే చెత్తాచెదారాలు, జీవాల వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లల్లోనే వేయాలని సూచించారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలను అందరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను రోడ్లు, ఖాళీ ప్రదేశాలు, ఓపెన్ చెత్త పాయింట్ల వద్ద వేయవద్దని దీని వలన స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నదీమ్, రాజుయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం : మేయర్

రూ 2.12 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఓం నగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తామని మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. శనివారం రూ 2.12 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు 7,16,18వ డివిజన్‌లలో మేయర్ లతా ప్రేమ్ గౌడ్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో కావలసిన మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లోని పనులు, నిర్మాణ దశలో ఉన్న పలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు పుష్ప శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి పాపయ్యయాదవ్, శ్రీలత సురేష్‌గౌడ్ నాయకులు ప్రేమ్‌గౌడ్, గోపాల్ ముదిరాజ్, టింకు రెడ్డి, నవీన్ ముదిరాజ్, యాదయ్య పాల్గొన్నారు.

నార్సింగిలో ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం


నార్సింగిలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని వైస్ చైర్మన్ గోపాల విజయ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం పని చేస్తుందన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత గ్యారంటీలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గతంలో ప్రజా పాలనలో ఇచ్చిన అప్లికేషన్లలో తప్పులు ఏమైనా ఉంటే ఈ ప్రజా పాలన సేవా కేంద్రానికి వచ్చి సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జి.శివారెడ్డి, దుర్గేష్‌యాదవ్, కమీషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ : ఉప కమిషనర్ రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: బక్రీద్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రాంతాలకు చెందిన మత పెద్దలు, పారిశుద్ధ్య విభాగం అధికారులు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బక్రీద్ సందర్భంగా చేపట్టాల్సిన పనులపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం ఉప కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ బక్రీద్ నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడంతో పాటు జంతువుల వ్యర్థాలను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే జంతువు వ్యర్థాలను వేసేందుకు ప్లాస్టిక్ కవర్లను అందజేశామన్నారు. వార్డులవారీగా తమ సిబ్బంది వ్యర్థాలను ఇంటింటికి వచ్చి వ్యర్థాలను సేకరిస్తారన్నారు. ఆయా ప్రాంతాల్లో వేసే వ్యర్థాలను సైతం తొలగించేందుకు సిబ్బందిని నియమించామన్నారు. ఇందుకు ప్రజా ప్రతినిధులు, స్థానికంగా ఉన్న మత పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల సహకారం తీసుకుంటున్నామన్నారు. శనివారం వీరందరితో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. ప్రజలు సైతం సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలను ఉప కమిషనర్ కోరారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏసీపీ ఖాదర్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నవాజుద్దీన్, హబీబ్ జైన్, కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఖాలీద్, ధనుంజయ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం


విద్యార్థులను అభినందిస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఎప్పుడు ముందుంటుందని అధ్యక్షులు యాదగిరి అన్నారు. మణికొండ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థులు కుశ్వంత్, మిర్యామి, భర్గవిలకు ఒకొక్కరికి రూ 10,116ల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. గతంలో సైతం అనేక మందిని ఆదుకున్నామని రానున్న రోజుల్లో సైతం పేద విద్యార్థులకు ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



మెరిట్ స్కాలర్‌షిప్ సర్టిఫికెట్ అందుకుంటున్న హర్షిత

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండకు చెందిన విద్యార్థిని సీబీఎస్ఈ పదో తరగతిలో ర్యాంకు సాధించినందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేశారు. అడ్వొకేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థిని ఆర్.హర్షితకు ఈ సందర్భంగా సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం పలువురు హర్షితను అభినందించారు.

ఘనంగా ఉద్యాన విశ్వవిద్యాలయ వార్షికోత్సవం


వీసీని సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ ఉద్యానవన విశ్వవిద్యాలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అంటే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే జ్ఞాన భాండాగారమన్నారు. ఈ కార్యక్రమంలో పలురు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి



అత్తాపూర్: చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటూ జీవనం సాగించే వృద్ధుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... రాంబాగ్ దేవాలయం సమీపంలో ఓ వృద్ధుడు అచేతన స్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వృద్ధుడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకునే అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కలుషితాన్ని అరికట్టాలని వినతి

చార్మినార్: రాబోయే పండుగలను పురస్కరించుకుని రోడ్లపై మురుగునీరు పొంగి పొర్లకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడమే కాకుండా కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని కోరుతూ చార్మినార్ నియోజకవర్గం బీజేపీ నాయకులు జలమండలి డివిజన్-1 జీఎం కృష్ణా నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిని వెంటనే అరికట్టాలన్నారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ చార్మినార్ నియోజకవర్గం కన్వీనర్ షెట్టి ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, బీజేపీ గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ యాదవ్, సంతోష్ తదితరులున్నారు.

బక్రీద్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దు

అధికారుల సమీక్ష సమావేశంలో కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి సూచనలు



మణికొండ: బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలన్నారు. ఇళ్లల్లోని చెత్తచెదారాలు, వ్యర్థాలు బయటకు రాకుండా ఇంటింటికి ప్లాస్టిక్ కవర్లు అందించాలన్నారు. వ్యర్థాలను అందులో వేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. వార్డుల వారీగా శానిటరీ జవాన్లకు ప్రత్యేక విధులు నియమించడం జరిగిందన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 8,9,17 వార్డులు రెడ్డి (9603458256), 6,7,16 వార్డులు శ్రీధర్ (9849808351), 10,15,18 వార్డులు వంశీ (8179035438), కోకాపేట్ వార్డులు 3,4,5,14లు మహిపాల్ (9705414716), గండిపేట్ వార్డు 11,13లు అహ్మద్(9966126092), ఖానాపూర్ వార్డు 12ను రవి (9666401090), వట్టినాగులపల్లి వార్డు 1ని రంజాన్ పాషా (9912370889), గౌలిదొడ్డి వార్డు 2ను శ్రీనివాస్ (9912081989)లు పర్యవేక్షిస్తారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో బక్రీద్ సందడి

జోరుగా గొర్రెల విక్రయాలు


విక్రయాల కోసం ఉంచిన గొర్రెలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో బక్రీద్ సందడి ప్రారంభమైంది. రాజేంద్రనగర్, పీడీపీ చౌరస్తా, నౌ నంబర్, ఉప్పర్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి, జూపార్కు రోడ్డు, గోల్డెన్ హైట్స్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో గొర్రెలను అమ్మకానికి తీసుకొచ్చారు. గొర్రెల కోసం ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేసి గొర్రెలను విక్రయిస్తున్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు గొర్రెలను ఖుర్బానీ ఇస్తారు. దీంతో గొర్రెలను విక్రయించేందుకు నగర శివారు ప్రాంతాలతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన కొందరు గొర్రెలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తెలంగాణ గొర్రెలకు ఈ సంవత్సరం అత్యధిక ధర పలుకుతుందని వ్యాపారస్తులు వెల్లడిస్తున్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం ధరలు అధికంగా ఉన్నాయని అయినప్పటికీ గొర్రెల విక్రయాలు భారీ జరుగుతున్నట్లు తెలిపారు. గొర్రెలతో పాటు పలువురు గడ్డి, రాగి ఆకు, దాణాను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. సోమవారం బక్రీద్ కావడంతో గొర్రెలు కొనుగోలు చేస్తున్న వారు వీటిని కొనుగోలు చేస్తున్నారు.

ట్యాక్స్‌బార్ అసోసియేషన్ పాలకమండలి సభ్యుడిగా నారాయణరావు



రాయదుర్గం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్‌బార్ అసోసియేషన్ పాలకమండలి సభ్యులుగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పివినారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఆయన రాయదుర్గంలోని మై హోమ్ భుజలో నివాసముంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సేవలను అందిస్తున్న సభ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం


గంగాధర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు

రాయదుర్గం: ప్రతి బస్తీలో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా చేయాలనే సంకల్పంతో ఉన్నామని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గోపన్‌పల్లిలోని గజానన్ కోఆపరేటివ్ సొసైటీలో శనివారం అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్‌వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయినతర్వాత సీసీరోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీలోని సమస్యలను వివరిస్తూ కార్పొరేటర్‌కు వినతిపత్రాన్ని అందించారు. అపార్ట్‌మెంట్‌వాసులు శ్రవణ్‌కుమార్, భానుప్రకాశ్, సందీప్, రామకృష్ణ, నగేష్, కిరణ్, సంపత్, కరుణ, సారంగ పాల్గొన్నారు.

చెట్లు నాటి చెరువులను రక్షించండి


మంచిరేవులలో చెట్లు నాటుతున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

మణికొండ: చెట్లు నాటి చెరువులను రక్షించండి అనే నినాదంతో పెద్ద ఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సయోధ్య స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మృదుల వేములపాటి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని మంచిరేవుల గ్రామంలోని చెరువు చుట్టు పక్కల రెండురోజుల పాటు హరితహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మాట్లాడుతూ చెరువులు మన జీవనాధారం అని అవి లేకుండా ఏ పట్టణాలు పెరగలేవన్నారు. ఈ వేసవిలో వచ్చిన వేడి గ్లోబల్ వార్మింగ్ వల్ల అని అందరికి తెలుసు అందుకే సంస్థ రాండ్‌స్టాడ్ ఆఫీసర్ సర్వీసెస్ వారి సౌజన్యంతో చెట్లు నాటే కార్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చెరువు చుట్టు ఉన్న ప్రాంతాల్లో చెట్లు నాటడం వల్ల ఆ చెరువులో ఎక్కువ నీరు నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. చెట్లు నేల పట్టుత్వాన్ని, భూసారాన్ని చక్కగా కాపాడతాయన్నారు. ప్రకృతికి అందాలను చేకూర్చడంలోనూ, వ్యవసాయంలోనూ చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల్ విజయ్‌బాబు, కమీషనర్ ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు పద్మావీరారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యాలు సులభం


బహుమతులు అందజేస్తున్న కె.రామకృష్ణారెడ్డి

మణికొండ: విద్యార్థులు కష్టపడి చదివితే తాము అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చునని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి సూచించారు. మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం వీఆర్4యూ గ్రూప్ అధ్యక్షులు బి.బాపూజీ, కార్యదర్శి డి.ఎస్.ఆర్. దాసల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.రామకృష్ణారెడ్డి హజరై ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు డి.కుశ్వంత్ (10), ఎస్.భార్గవి (9.8), ఎం.మిర్యాని (9.8), పి.చక్రిక(9.7), ఎన్.శిరీష (9.3), వై.ప్రవీణ్‌కుమార్ (9.2)లు ఉత్తమ గ్రేడ్‌లు సాధించారన్నారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు వీఆర్4యూ ముందుకు వచ్చి విద్యార్థులకు బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. 10/10 జీపీఏ సాధించిన డి.కుశ్వంత్‌కు రూ.50 వేల రూపాయల నగదు బహుమతి ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్, సభ్యులు రొక్కం కుమార్‌రావు, సాంబశివరావు, ప్రదీప్‌రావు, పి.ఎస్.వి.కుమార్, కన్నయ్య, నాగేంద్రరావు, విజయలక్ష్మి, హల్దర్, రంగాచారి, కె.ఎల్.గుప్తా, నాగభూషణం, అడ్ల రాంబాబు, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ అకాడమీ సందర్శన


ఐఏఎస్ ప్రొబేషనర్లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీని ఏడుగురు ఐఏఎస్ ప్రొబేషనర్లు ప్రాక్టికల్ ట్రెనింగ్‌లో భాగంగా శుక్రవారం సందర్శించారు. టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బీష్ట్, జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర టీజీపీఏ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు వారికి స్వాగతం పలికారు. అకాడమీపై సంక్షిప్త ప్రసున డిప్యూటీ డైరెక్టర్ సి.నర్మద అందజేశారు. అనంతరం ఇంటరాక్టివ్ సెషన్‌లో శిక్షణ పొందిన వారు తమ శిక్షణ అనుభవాల గురించి వివరించారు. శిక్షణ పొందిన వారికి క్యాంపస్‌లోని వివిధ అన్ని ప్రాంతాలను చూపించి లోతుగా శిక్షణ సంబంధిత అంశాలను వివరించారు. ఇదిలా ఉండగా వికారాబాద్ ఐఏఎస్ ట్రైనీ కలెక్టర్‌గా అకాడమీకి విచ్చేసిన ఐఏఎస్ 2023 బ్యాచ్‌కు చెందిన ఉమా హరిత టిఎస్‌పిఏ ఎస్పీ వెంకటేశ్వర్లు కూతురు. ఆమె ట్రైనీ కలెక్టర్‌గా అకాడమీకి రావడంతో వెంకటేశ్వర్లు ఆమెకు సెల్యూట్ చేసి స్వాగతం పలికారు.

విరివిగా మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు.శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని సాయివైభవ్ కాలనీలో హరిత వైభవోత్సవం కార్యక్రమాన్ని ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు చేసి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైనందున అన్ని చోట్లా మొక్కలు నాటేందుకు అందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ఇళ్లలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదం ఉంటుందన్నారు.అనంతరం కాలనీ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రమేష్, శ్రీనివాస్, నారాయణ, కాలనీవాసులు సుజిత్‌కృష్ణ, సరస్వతి, సిద్దార్థ, నవీన్, పవన్, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.